గొప్ప పోరాట యోధుడిని కోల్పోయాం

– జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తెలుగు ప్రజలు గర్వించదగ్గ మహా పోరాట యోధుడిని కోల్పోయా మని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపం చంలో అతిపెద్ద ఫిల్మ్ సిటీ రూపకర్త, ఈనాడు, ఈటీవీ, మార్గదర్శి, ఉషా కిరణ్, డాల్ఫిన్ గ్రూప్ ఆఫ్ హోటల్స్, కళాంజలి, ప్రియా, మయూరి ఫిలిమ్స్ లాంటి సంస్థల వ్యవస్థాపకులుగా వేలాది మందికి ఉపాధి కల్పించిన మహనీయులు రామోజీరావు అని కొనియాడారు. 1990లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమానికి, సంపూర్ణ మద్య నిషేధ ఉద్యమానికి ఊతమిచ్చారని, నిరంతర కృషి, పట్టుదల, అంకితభావం, దృఢదీక్షలకు పర్యాయపదం రామోజీ అని తెలిపారు. భారతదేశంలో రెండవ అత్యున్నత అవార్డు పద్మ విభూషణ్ గ్రహీత రామోజీరావు అందరికీ ఆదర్శనీయులన్నారు. జీవితంలో అనేక ఒడుదుడుకులు సంభవించినా వాటి అన్నింటిని ఎదుర్కొన్న ధైర్యశాలి రామోజీరావు అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో నిలిచిన ఘనత రామోజీరావును పేర్కొన్నారు.

ఎన్జీ రంగా సేవలు అందరికీ ఆదర్శనీయం

విశాలాంధ్ర-పొన్నూరు : స్వాతంత్ర సమరయోధుడు, ఉత్తమ పార్లమెంటేరియన్ ఆచార్య ఎన్జీరంగా 29వ వర్ధంతిని శనివారం ఎన్జీరంగా కమిటీ సభ్యులు నిర్వహించారు. వెలగా సుబ్బారావు, కొసరాజు వెంకటరాయుడు, గోగినేని వెంకటేశ్వరరావు, బండ్లమూడి నాగేశ్వర మిత్ర, బొద్దులూరి రంగారావు పలువురు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. దేశంలోని రైతాంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన సేవలు అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు.

మునిపల్లె పీఏసీఎస్ చైర్మన్ పదవికి కోట రాజీనామా

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు మండలం మునిపల్లె వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ పదవికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోటా శ్రీనివాసరావు శనివారంరాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జిల్లా అధికారులకు పంపిస్తున్నట్లు మీడియాకు తెలిపారు. పార్టీకి సేవ చేసినందుకు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య పీఏసీఎస్ చైర్మన్ పదవిని ఇచ్చారని తెలిపారు. సహకరించిన సొసైటీ సభ్యులకు, రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్ఫూర్తిప్రదాత రామోజీరావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పల్లె ప్రజల జీవితాల్లో నిరంతర సంక్రా ంతి కోసం పరితపిం చిన పద్మ విభూషణుడు చెరు కూరి రామోజీరావు అని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్, రైతునేస్తం మాసపత్రిక సంపాదకులు యడ్లపల్లి వేంకటేశ్వర రావు అన్నారు. ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు అకాల మరణం చెందిన సందర్భంగా వెంకటేశ్వరరావు రామోజీరావు పార్థీవ దేహానికి పూలమాలలతో నివాళులర్పించారు. పల్లె ప్రజల జీవితాల్లో నిరంతర సంక్రాంతి కోసం ఆరాటపడిన క్రాంతిమూర్తి రామోజీరావు ఆకస్మిక మరణం తెలుగు జాతికి తీరని లోటు అని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్నితెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీ వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు పట్టణ ప్రసిద్ధి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం అర్చకులు ధూళిపాళ్ల దంపతులను ప్రత్యేక ఆహ్వానం పలికి పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. పూజా కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరనిలోటు

విశాలాంధ్ర-మంగళగిరి : తెలుగు ప్రజల జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్ర వేసిన రామోజీరావు తెలుగు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచి పోతారని నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య అన్నారు. టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో శనివారం రామోజీ రావు చిత్రపటా నికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామోజీ రావు కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. నియోజకవర్గ సమన్వ యకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ మంచి దార్శికుని కోల్పోయా మని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు బీసీ సెల్ అధ్యక్షులు కారంపూడి అంకమ్మరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

9న జీ తెలుగులో డ్రామా జూనియర్స్ సీజన్ 7

విశాలాంధ్ర-గుంటూరు : అత్యంత ప్రేక్షకాదరణ పొందిన జీ తెలుగు డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ ప్రారంభం కానుందనీ సంస్థ ప్రతినిదులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవంతంగా 6 సీజన్లు పూర్తిచేసుకున్న జీ తెలుగు డ్రామా జూనియర్స్ 7వ సీజన్ ఈ నెల 9న, సా॥ 6:00 గంటలకు! ప్రతి ఆదివారం రాత్రి 9:00 గంటలకు ప్రసారమవుతుంద న్నారు. భావోద్వేగం నిండిన కథతో ప్రేక్షకుల హృదయాలను తాకే కథతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ మేఘ సందేశం ఈ నెల 10 నుంచి సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు రాత్రి 7:30 గంటలకు!! ప్రసారం కానున్నద న్నారు. డ్రామా జూనియర్స్ సీజన్ 7కు కూడా సీనియర్ నటి జయప్రద జడ్జిగా కొనసాగను న్నారన్నారు. టాలీవుడ్ కమెడియన్, దర్శకుడు బలగం వేణు, అందాల నటి పూర్ణ కూడా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించనున్నారన్నారు. చిన్న పిల్లలను కళాకారులుగా ఎదగడానికి, ప్రేక్షకులను అలరించ డానికి జీ తెలుగు అద్భుత అవకాశాన్ని అందిస్తోందన్నారు. ఇక ఈ సీజన్‌కి ప్రముఖ నటుడు, నిర్మాత శ్రీరామ్ వెంకట్ వ్యాఖ్యాతగా, పడమటి సంధ్యారాగం సీరియల్ అధ్య, రామలక్ష్మి మెంటర్స్ వ్యవహరిస్తున్నారు.

తాళాయపాలెం శైవక్షేత్రంలో దొంగతనం

విశాలాంధ్ర-తుళ్లూరు : రాజధాని పరిధిలోని మందడం శివారు గ్రామం తాళ్లాయపాలెంలో ఉన్న శ్రీ శైవక్షేత్రంలో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగింది. ఆలయంలో శివుని వెండి పాదుకలు అపహరణకు గురయ్యాయి. తాడికొండ నియోజక వర్గ శాసన సభ్యులుగా ఎన్నికైన తెనాలి శ్రావణ్ కుమార్ శనివారం శైవక్షేత్రంకు వెళ్లి పీఠాధిపతి శివస్వామిని దొంగతనం గురించి అడిగి తెలుసుకున్నారు. దొంగలను త్వరితగతిన పట్టుకోవాలని సీఐ షేక్. సుభానిని శ్రావణ్ కుమార్ కోరారు. శ్రావణ్ కుమార్ వెంట టీడీపీ నాయకులు ధనేకుల సుబ్బారావు, బెల్లంకొండ నరసింహారావు, చిలకా బసవయ్య, కొండెపాటి సతీష్ చంద్ర (బుజ్జి) ఉన్నారు.

సాహితీ, సాంస్కృతిక, సినిమా రంగాల్లో తనదంటూ ముద్రవేసిన బొల్లిముంత

విశాలాంధ్ర-తెనాలి : తెలుగు సాహితీ చలనచిత్ర రంగాలలో తనదంటూ విశిష్ట స్థానాన్ని సముపాదించుకున్న బొల్లిముంత శివరామకృష్ణ పలురంగాలను, ప్రజలను ప్రభావితం చేశారని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా ఉపాధ్యక్షులు బుద్ధభూమి సంపాదకుడు గోలి సీతారామయ్య చెప్పారు. నందులపేట, కవిరాజపార్కులోని సీనియర్ సిటిజన్ హాలులో శుక్రవారం అభ్యుదయ కళా సమితి, ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో-ఆపరేషన్ అండ్ ఫ్రండ్ షిప్ (ఇస్కఫ్) సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ అభ్యుదయ సినీరచయిత,కమ్యూనిస్టు యోధుడు బొల్లిముంత శివరామకృష్ణ 20వ వర్ధంతి సభలో పాల్గొని ఆయన ప్రసంగించారు. సభకు అరసం తెనాలి అధ్యక్షులు కనపర్తి బెనహర్ అధ్యక్షత వహించారు. సీతారామయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ అభ్యుదయ సాహిత్యోద్యమంలో ప్రజా నాట్య మండలి సాంస్కృతికోద్యమంలో శాంతి స్నేహ సంఘాల్లో జీవితాంతం బొల్లిముంత కొనసాగారని చెప్పారు. అనేక చిత్రాల్లో పదునైన సంభాషణలు సమకూర్చారని చెప్పారు. నిమజ్జనం రాష్ట్రపతి అవార్డు, కాలం మారింది రాష్ట్ర ప్రభుత్వం అవార్డు పొందాయన్నారు. సినీ నటి శారదకు నిమజ్జనం చిత్రం ద్వారానే ఊర్వశి అవార్డు లభించిందన్నారు. నిగర్వి, నిరాడంబర జీవితం గడిపిన ఉదాత్త మానవుడు బొల్లిముంత అన్నారు. ఆల్ ఇండియా గ్రామీణ దాక్ సేవక్స్ ఇండి యన్ జాతీయ అధ్యక్షుడు బి.వి. రావు మాట్లాడుతూ ప్రజలను చైతన్యపరచేందుకు బొల్లిముంత అనేక సాహిత్య ప్రక్రియలను ప్రజాకళా రూపాలను సుసంపన్నం చేశారని చెప్పారు. ఆయన రాసిన రాజకీయ గయోపాఖ్యానం, రాజకీయ కురుక్షేత్రం, సంభవామి యుగే యుగే నేటికి ప్రజలను చైతన్య పరుస్తాయన్నారు. బెంగాల్ కరువుపై బుర్రకథ, రైతుల జీవన స్థితిగతులను వివరిస్తూ రైతుబిడ్డ హరికథ రాసి తయారు చేసి ప్రదర్శనలిప్పించారన్నారు. బొల్లిముంత కథలు సూక్ష్మంలో మోక్షం, అంతరాత్మ అంత్యక్రియలు శివరామకృష్ణ కథలు సంపుటాలుగా వెలువడ్డాయని నేటి యువ తరం వాటిని చదివి విజ్ఞాన వంతులు కావాలన్నారు. 1940-50 దశకాల తెలుగుప్రాంతాల సామాజిక రాజకీయ సాంస్కృతిక పరిణామాలను చిత్రిస్తూ రాసిన కథలు తెలంగాణా స్వాతంత్ర్య ఘోష, క్విట్ కాశ్మీర్, ధర్మసంస్థాపనార్థాయ నాటికలు రాశారన్నారు. రక్తకన్నీరు నాగభూషణం బొల్లిముంత రాసిన "అందరూ బ్రతకాలి" నాటకం రాష్ట్ర రాష్ట్రేతరంగా వందలాది ప్రదర్శనలిచ్చారని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ అజ్ఞాతంలో ఉంటూ నగారా పత్రికను నడిపారని చెప్పారు. రచయిత రంగిశెట్టి రమేష్ మాట్లాడుతూ శివరామ కృష్ణ వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపుతూ ప్రజలను చైతన్యవంతులను చేసే శక్తివంతమైన రచనలు చేశారన్నారు. శివరామకృష్ణ జీవిత విశేషాలను వివరిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో బాల సంఘాలు, మహిళాసంఘాలు నెలకొల్పి వారికి కోలాటం, చెక్కభజన, సంగీతం, నాటికలు నేర్పించేవారని, కొన్ని నాటికలు ప్రదర్శన సమయంలో కళాకారులు రాని పక్షంలో ఆయన వేషాలు వేశారని స్త్రీపాత్రలు కూడా ధరించారని వివరించారు. సభా ప్రారంభంలో గాయకులు దేవరపల్లి నీలాంబ్రం, బెల్లంకొండ వెంకట్, విజయసారధి, శ్రీదేవి, వసంత యామిని, శారద చలపతి, బెజ్జంకి నాగమణి అభ్యుదయ గీతాలు, జానపద గేయాలను గానం చేసి ప్రేక్షకు లను అలరింపజేశారు. కార్యక్రమంలో తన్నీరు శివశంకర్, వెనిగళ్ళ కృష్ణప్రసాద్, దేవిశెట్టి కృష్ణారావు, వెనిగళ్ళ వెంకటేశ్వర రావు, కుటుంబ సభ్యులు బొల్లిముంత గోపీకృష్ణ, బొల్లిముంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు. సభా ప్రారంభంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నీలాంబ్రం, బెజ్జంకి నాగమణి శివరామకృష్ణపై గేయాలను రాసి ఆలపించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా తిష్టవేసిన ప్రజా సమస్యలను పరిష్క రించాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ను కోరారు. తూర్పు నియోజకవర్గం ఎమ్మె ల్యేగా గెలుపొందిన నసీర్ అహ్మద్ను హోటల్ మాల్యాద్రి సీపీఐ నగర బృందంతో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర బృందం నసీర్ అహ్మద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కోట మాల్యాద్రి మాట్లాడుతూ గుంటూరు పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా డొంక రోడ్డు, పొత్తూరువారి తోటలో నిరుపయోగంగా ఉన్న వెల్ఫేర్ స్థలాన్ని శుభ్రం చేయించాలని కోరారు. గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆ స్థలంలో హాస్పటల్ నిర్మించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంత ప్రజలకు నీటి సౌకర్యం.. రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ వెల్ఫేర్ స్థలం విషయంలో... ఆ ప్రాంత ప్రజల మౌలిక అవసరాలను త్వరితగతిన పరిష్కారం అయ్యేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ను కలిసిన వారిలో సిపిఐ నగర బృందా సభ్యులు, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, చల్ల మరియదాసు, మంగా శ్రీనివాసరావు, మున్న, శశి తదితరులు ఉన్నారు.

రామోజీరావు మృతి తీరని లోటు

విశాలాంధ్ర-గుంటూరు : ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు మరణం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీరని లోటు అని, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని టీడీపీ నాయకులు కోరారు. రామోజీ రావు స్వర్గస్తులైన సందర్భంగా శనివారం స్థానిక అరండల్ పేటలో ఉన్న జిల్లా టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్ర ఫటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారిలో ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, గుంటూరు నగర పార్టీ అధ్యక్షులు దేగల ప్రభాకర్, రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామోజీరావు మృతి తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది

విశాలాంధ్ర-గుంటూరు : ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని గుంటూరు జోన్-5 ఇన్‌చార్జ్ కోవెలముడి (నాని)రవీంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు శనివారం గుంటూ రులోని జోన్-5 ఇన్‌చార్జ్ కోవెలముడి రవీంద్ర (నాని) కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించిన ఘనత రామోజీరావుకు దక్కుతుందన్నారు. తెలుగు పత్రికా, మీడియా రంగానికి రామోజీరావు లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిదని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ రామోజీ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షర యోధుడు రామోజీరావు



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అక్షర యోధుడు చెరుకూరి రామోజీరావు అని డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ అన్నారు. ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మృతి చెందిన సందర్భంగా స్థానిక అహల్యా హాస్పిటల్ నందు డాక్టర్ రాజకుమారితో కలిసి రామోజీ రావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉమా శంకర్ మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. తెలుగు రాష్ట్రాలకు, దేశానికి ఎన్నో సేవలు అందించినట్లు కొనియాడారు. ఈనాడు గ్రూపు సంస్థల స్థాపనతో వేల మందికి ఉపాధి కల్పించారని, మీడియా రంగంలో రామోజీది ప్రత్యేకమైన శకమన్నారు. మీడియా రంగంలో ఆయనొక శిఖరం అని అన్నారు. నివాళులర్పించిన వారిలో డాక్టర్ శిరీష, డాక్టర్స్, ఉన్నారు.

రామోజీరావుకు నివాళులర్పించిన రాజధాని రైతులు

విశాలాంధ్ర-తుళ్లూరు : ఈనాడు గ్రూప్ సంస్థల అధిపతి రామోజీరావుకు శనివారం రాజధాని రైతులు నివాళులర్పించారు. తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామంలోని రాజధాని రైతుల శిబిరంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సంవత్సరాలుగా రాజధాని రైతులు చేస్తున్న ఉద్యమానికి, నిరసన కార్యక్రమాలకు రామోజీరావు అందించిన మద్దతు మరువలేమన్నారు.

ఈనాడు వ్యవస్థాపకులు రామోజీరావుకు స్మృత్యాంజలి

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి పట్టణంలో ఈనాడు దినపత్రిక వ్యవస్థాపకులు, పారిశ్రామికవేత్త, సమాజ సేవకుడు, మహానుభావులు చెరుకూరు రామోజీరావు మృతిపట్ల సంస్థలు, ప్రముఖులు, తమ ప్రగాఢ సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు, రామోజీరావు సన్నిహితులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణా మూర్తి తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలుపుతూ నందులపేట, కవిరాజపార్కులోని పెన్షనర్స్ హాలులో సంతాప సభ నిర్వహించారు.

సుందరరావు, మల్లవరపు నాగయ్యలకు నివాళులు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నగరంలోని మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ (రిటైర్డ్ ఆర్ఐ), జె సుందరరావు అనారోగ్య కార ణంగా శనివారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి సీపీఐ నియోజక వర్గం కార్యదర్శి చిన్ని తిరపతయ్య నివాళులర్పించారు. అలాగే కాజా గ్రామంలో ఎమ్మార్పీ ఎస్ రాష్ట్ర నాయకులు మల్లవరపు నాగయ్య శనివారం మృతి చెందగా ఆయన భౌతిక కాయానికి కూడా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పట్టణ కార్యదర్శి పత్తవరపు వెంకట శివప్రసాద్, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వర రావు, తదితరులు ఉన్నారు.

తెలుగు భాషకు ప్రపంచ గౌరవాన్ని తెచ్చిన వ్యక్తి రామోజీరావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తెలుగు భాషకు ప్రపంచ గౌరవాన్ని తెచ్చిన మహోన్నత వ్యక్తి చెరుకూరి రామోజీరావు అని మాజీమంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్ కొని యాడారు. ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు స్వర్గస్తులైన సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డొక్కా మాణిక్యవర ప్రసాద్ మాట్లాడుతూ రామోజీరావు మరణం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికా రంగంలోనే కాకుండా అనేక వ్యాపార రంగాలలో ఆయన వినూత్నమైన ఆలోచనలు చేసిన వ్యక్తి రామోజీ అని, భాష, సాహిత్యం పట్ల గౌరవం ఉన్న వ్యక్తి రామోజీరావు అని అన్నారు. పత్రికా రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలో కూడా వినూత్నమైన ఆలోచనలు చేసిన వ్యక్తి అని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో వెంకట్, పినపాటి మోహనరావు, సంకూరి రాజారావు, వీరమణి, బిక్కు నాయక్, ప్రత్తిపాటి రాజశేఖర్ పాల్గొన్నారు.

దివంగత రామోజీరావు నివాళులర్పిస్తూ సైతిక శిల్పం ఏర్పాటు

విశాలాంధ్ర-తాడేపల్లి : సీతా నగరం కృష్ణాపుష్కర ఘాట్‌లో ఈనాడు సంస్థల అధినేత దివంగత రామోజీరావుకు నివాళులర్పిస్తూ సైతిక శిల్పం ఏర్పాటు చేశారు. ప్రముఖ సైతిక శిల్పి వరప్రసాద్ ఆధ్వర్యంలో 3గంటలు శ్రమించి ఇసుకతో నిర్మించారు. మొదటిసారికృష్ణానది పుష్కర ఘాట్‌లో ఏర్పాటు చేయటంతో అక్కడికి వచ్చిన స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

నాదెండ్ల మనోహర్ సంతాపం

విశాలాంధ్ర-తెనాలి : మీడియా మొఘల్ రామోజీరావు అస్తమయం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని చైర్మన్, రాజకీయ వ్యవహారాల కమిటీ జనసేనపార్టీ ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ శ్రద్ధాంజలి ఘటించారు. తెనాలి జనసేన కార్యాలయంలో రామోజీరావు సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. మనోహర్ మాట్లాడుతూ ఆయన అస్తమయం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని, రామోజీరావు తాను నమ్మిన విలువలు, సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా పక్షం వహిస్తూ మీడియా ప్రపంచంలో ప్రయాణం చేశారని అది అసామాన్యమైందని చెప్పారు. ఆయన మరణం మీడియా రంగానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నాడు.

ఎన్డీయే కూటమి విజయోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-తాడేపల్లి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురంలో భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా అలాగే మంగళగిరి లో నారా లోకేష్ భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చిలపల్లి శ్రీనివాసరావు నివాసం వద్ద తాడేపల్లి టౌన్ నాయకులు అంబటి తిరుపతిరావు, సామల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గంలో ఎన్డిఏ కూటమి విజయానికి కృషి చేసిన చిల్లపల్లి శ్రీనివాసరావుకి వేద పండితుల చేత ఆశీర్వచనం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే గళ్లా మాధవి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు గోరంట్లలోని వెంకటేశ్వరస్వామి గుడి, నగరంపాలెంలోని రాముల వారి గుడిలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి, స్వామి వార్ల తీర్థ, ప్రసాదులు అందజేసి, భవిష్యత్తులో మాధవి ఉన్నత పదవులు ప్రసాదించాలని వేదపండితులు ఆశీర్వదించారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

అక్షర యోధునికి అశ్రునివాళి

– గుంటూరు జిల్లా రచయితల సంఘం

విశాలాంధ్ర-గుంటూరు : తెలుగు పత్రికా రంగంలో శిఖరాగ్రానికి చేరిన అక్షర యోధుడు రామోజీరావు మరణం తెలుగు జాతికే కాక యావత్ భారతానికే తీరని లోటని గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని ఆవేదన వ్యక్తంచేశారు. పత్రికా రంగంలోనే కాకుండా సినిమా, టీవీ, స్టూడియో వంటి ప్రవేశించిన అన్ని రంగాలలో అనితర సాధ్యమైన విజయాలను అందుకొని భావితరాలకు మార్గదర్శిగా నిలిచారని, తెలుగు సాహిత్యానికి తన పత్రికల ద్వారా విశేషమైన కృషి చేసిన ఋషి రామోజీకి ఘనమైన నివాళులు అందిస్తున్నామ న్నారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి ప్రఘాఢ సాను భూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు. జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ వి. నాగ రాజ్యలక్ష్మి, బొమ్ము ఉమా మహేశ్వరరెడ్డి, కెజె.రమేష్, కోశాధికారి నానా, సభ్యులు డాక్టర్ పి.బలరాం, డాక్టర్ ఎం. లలిత కుమారి, షేక్.కాశింబి, తాటికోల పద్మావతి, యక్కంటి పద్మావతి, పి.దుర్గ, డాక్టర్ గోవిందు, కొణతం నాగేశ్వరరావు, బి. కుమార రాజు, పి. విజయలక్ష్మి, ఈపూరి వెంకట రెడ్డి, వేలాంగినిరాజు, గాదేపల్లి మల్లికార్జునుడు, పి.సుభాషిణి, డి.అనిల్ కుమార్, తపతి కిరణ్, అనేక మంది సాహితీ ప్రియులు తమ అశ్రునివాళులు అందచేశారు.

నారా లోకేష్‌ను కలిసిన ప్రిన్స్ అధినేత మహేష్ పాల్

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు పట్టణానికి చెందిన ప్రిన్స్ సంస్థల అధినేత మహేష్ పాల్ శనివారం తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను టీడీపీ కార్యాలయంలో కలిశారు. మంగళగిరి స్థానం నుంచి అత్యధిక మెజారిటీతో గెలిచి నందుకు నారా లోకేష్‌కు పుష్ప గుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించాలని మహేష్ పాల్ లోకేష్‌ను కోరినట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యమంటూ చంద్రబాబు ప్రకటించడంపై హర్షం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యమంటూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం పట్ల అవగాహన సంస్థ హర్షం చేస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోలేదన్నారు. గెలిచిన ప్రజా ప్రతినిధులందరూ తనతో సహా 'స్టేట్ ఫస్ట్' నినాదంతో పని చేస్తామని చంద్రబాబు ప్రకటించటం పట్ల అవగాహన సంస్థ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ అధికారాన్ని చూసి ఎవరు ఆకాశంలో ఎగరొద్దని, నమ్మకంతో ఇచ్చిన విజయాన్ని బాధ్యతగా సమాజ సేవ చేసేందుకు వినియోగించాలన్నారు. రాష్ట్రంలో బ్యూరో క్రాట్ల పాలన ఉండదని, ఇకనుంచి అన్ని విషయాలు నేనే వింటానని, ఇకనుండి మారిన చంద్రబాబును చూస్తారని చంద్రబాబు ప్రకటించడం గొప్ప విషయమ న్నారు. ఢిల్లీలో ఏ పని మీద పోయినా రాష్ట్ర ప్రయోజనాలే ప్రాధాన్యంగా ఉంటాయన్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు ఎంపీ పెమ్మసానికి కేంద్ర మంత్రి పదవి

విశాలాంధ్ర-గుంటూరు : అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన గుంటూరు పార్లమెంట్ ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు కేంద్ర మంత్రి పదవి ఖరారైనట్లు విశ్వసనీయ సమాచారం. చంద్రబాబుకు, లోకేష్‌కు అత్యంత సన్నిహితు డైన ఎన్నారై పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గుంటూరు ఎంపీ సీటును కేటాయించింది. ఊహించిన రీతిలో పెమ్మసాని ప్రత్యర్థిపై సుమారు మూడున్నర లక్షల ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. సామాన్య మధ్యతరగతి కుటుంబం నుండి కష్టపడి చదువుకొని డాక్టర్‌గా అమెరికాలో పేరు ప్రతిష్టలు పొంది, మెడికల్ లైసెన్సింగ్ విధానంలో ప్రత్యేక మెటీరియల్ రూపొందించి దేశ వ్యాప్తమైన డాక్టర్ పెమ్మ సానిపై చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ కనపరిచేవారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి వర్గంలో టీడీపీకి స్థానం లభించడంతో చంద్రబాబు గుంటూరు జిల్లా నుండి డాక్టర్ పెమ్మసాని పేరును సూచించినట్లు సమాచారం. ఢిల్లీలో ఆదివారం జరగబోయే ప్రధాని నరేంద్ర మోడీ మంత్రివర్గంలో తమ్మసాని పేరు ఖరారైనట్లు తెలుస్తుంది.

యరపతినేని శ్రీనివాసరావుకు అభినందనలు

విశాలాంధ్ర-తాడేపల్లి : గురజాల నియోజకవర్గ శాసన సభ్యులు యరపతనేని శ్రీనివాసరావును టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట సాంబయ్య, సింక కోటేశ్వరరావు, ఆళ్ల వెంకట నారాయణ, తోట సురేష్, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రామోజీరావుకు ఘన నివాళులు

విశాలాంధ్ర-ఫిరంగిపురం: కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం కన్ను మూసిన రామోజీరావు మరణం బాధాకరమని ఫిరంగిపురం మండల టీడీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ వారి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మండల టిడిపి అధ్యక్షులు మండవ నర్సింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సంతాప కార్యక్రమానికి టిడిపి సీనియర్ నాయకులు కొల్లి శివారెడ్డి మాట్లాడుతూ మీడియా రంగంలో రామోజీరావు పాత్ర స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో అప్పారావు, కొండలు, వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పొనుగుపాడులో 104 సేవలు

విశాలాంధ్ర-ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలో ప్రజలకు 104 వాహనం ద్వారా రోగులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి యానీ గ్రేస్ తెలిపారు. గ్రామంలో 294మందికి వైద్య సేవలు అందించినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుదర్శన్‌రాజు, హెచ్‌పి జ్యోతి, ఎయన్‌యం ఏసమ్మ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

లోకేష్‌ను కలిసిన సైదారావు

విశాలాంధ్ర-పెదకూరపాడు : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను శరవణ్ అగ్రిటెక్ కోల్డ్ స్టోరేజ్ చైర్మన్ వట్టికూటి సైదారావు వట్టికూటి రామ సిద్ధార్థ, ఎన్నారై నూతలపాటి అజయ్‌ను మర్యాద పూర్వ కంగా లోకేష్ కలిశారు. టీడీపీ హయాంలోనే రైతు పది కాలాలు పాటు ఆనందంగా ఉంటార న్నారు. ఇది రైతన్న రాజ్యమని, ఆంధ్రుల ఏకైక రాజధాని అమరావతి అని సైదారావు అన్నారు. చంద్రబాబుకు రాష్ట్రంలోని రైతులు, బడుగు బలహీన వర్గాలు, ముస్లిం, మైనారిటీలు అండగా ఉన్నార న్నారు. 2024లో రాజధాని ప్రారంభమవు తుందని, అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌గా చంద్రబాబు చేసి చూపిస్తారని సైదారావు అన్నారు.

మాల మహానాడు వర్కింగ్ అధ్యక్షులుగా కొట్టే వెంకట్రావు ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ మండలం గోనుగుంట్ల వారి పాలెం గ్రామానికి చెందిన కొట్టే వెంకట్రావు ను వినుకొండ నియోజకవర్గ మాల మహానాడు వర్కింగ్ అధ్యక్షులుగా, జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు డా గోదా జాన్ పాల్ చేతుల మీదగా శనివారం నియామక పత్రం అందజేయడం జరిగింది. జాన్ పాల్ మాట్లా డుతూ నేటి నుండి జాతీయ రాష్ట్ర జిల్లా కమిటీలా పిలుపుమేరకు ఎస్సీ వర్గీకర ణకు వ్యతిరేకంగా పనిచేస్తూ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని గ్రామ గ్రామానికి తీసుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు నియోజకవర్గంలోని ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు, కార్మిక కర్షకులు కమిటీలుగా ఏర్పాటు చేయాలని మాలల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కొట్టా వెంకటరావు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర జిల్లా నియోజకవర్గ కమిటీ మేరకు పనిచేస్తానని నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని ముమ్మ చేయకుండా కమిటీ కి కట్టుబడి పని చేస్తానని, నాకు పదవి ఇచ్చినందుకుగాను కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రు విజయ్, కార్యదర్శి రాయని చిన్న, వినుకొండ నియోజకవర్గ అధ్యక్షులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

విజయపురి సౌత్‌లో రామోజీరావుకు ఘన నివాళులు

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత రామోజీరావు అనారోగ్యంతో మృతి చెందడంతో స్థానిక టీడీపీ, జనసేన నాయకులు శనివారం విజయపురిసౌత్‌లో సంతాపం వ్యక్తం చేశారు. రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనం తరం టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ మాట్లాడుతూ రామోజీరావు సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య విజయాలు సాధించిన వ్యక్తిగా నిలిచారని కొనియాడారు. రామోజీరావు పత్రికా రంగంలో ఎన్నో సవాళ్లు, సమస్యలను అధిగమించి ఎవరికీ ఎక్కడా తలవంచ కుండా విలువలతో సంస్థలు నడిపిన విధానం అందరికీ ఆదర్శనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో విజయపురిసౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకట శ్వర్లు, ఆదెపు కోటయ్య, డాక్టర్ ఎన్.బసివిరెడ్డి, తోటకూర పరమేశ్వరావు, సత్తిబాబు, కట్టా రాజు, గంటా ధనుంజయరావు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఊరే మార్క్ సైదారావు, షేక్ మస్తాన్, బొబ్బిలి చంద్రశేఖర్, పవన్, రామ్ చంద్, దేవుడు, బాలస్వామి, రమేష్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేసిన నాయకులకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-దుర్గి : సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో దుర్గి మండలం, ముటుకూరు గ్రామంలో తెలుగు దేశం పార్టీ మెజార్టీ రావడానికి కృషి చేసిన గ్రామ టీడీపీ నాయకులు, పెద్దలకు, చర్మకారుల సంక్షేమ సంఘం నాయకులు పులిమెల నాగేశ్వరరావు, గ్రామ దళిత టీడీపీ కార్యకర్తలు మాచర్ల మదార్, సురేష్ తదితరులు జై టీడీపీ, జై జై భీమ్ నినదిస్తూ నాయకులకు టీడీపీ విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దళిత టీడీపీ కార్య కర్తలు, ఎంపీపీ యేచూరి సునీత, సాయి శంకర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. అదే విధంగా గ్రామంలో టీడీపీని విజయప్రధంలో నడిపించిన లింగా బ్రహ్మయ్య, పుల్లయ్య, రమేష్, యేచూరి రవి, సాంబయ్య, చెన్నయ్య, భాస్కర్, అంజి తదితరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

రామోజీరావు మృతి అత్యంత బాధాకరం

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఈనాడు సంస్థల అధినేత, పద్మ విభూషణ్ రామోజీరావు మరణం అత్యంత బాధాకరం అని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ అన్నారు. శనివారం గంగా ధర్ టీడీపీ కార్యాలయంలో రామోజీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ రామోజీరావు తెలుగు జాతికి ఒక వెలుగు దివిటీలాగా.. నిరంకుశ పాలకులపై తన ఈనాడు పత్రిక, ఈటీవీ ద్వారా ప్రజలను చైతన్యపరిచారని అన్నారు. రామోజీరావు జీవితం ఈనాటి యువతకు ఆదర్శం అని అన్నారు. తెలుగు జాతి ఉన్నంతవరకు రామోజీరావు పేరు చిరస్థాయిగా నిలిచి పోతుందని మద్దిరాల గంగాధర్ పేర్కొన్నారు.

భాష్యం ప్రవీణ్‌కు అభినందనలు : జనసేన నేతలు

విశాలాంధ్ర-పెదకూరపాడు : పెదకూరపాడు నియోజక వర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఎన్డీఏ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో పెదకూరపాడు మండల జనసేన ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు మల్లెల వెంకట చలపతిరావు, చందు మురళి, అప్పారావు, రమేష్, హనుమంతరావు, శివయ్య జనసేన యూత్ ఆధ్వర్యంలో మే 13 జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఘన విజయంపై విజయం సాధించడంలో గతంలో ఎన్నడలేని విధంగా అత్యధిక మెజార్టీతో ప్రవీణ్ గెలు పొందటం శుభ పరిణిమన్నారు. జనసేన నేతలు మండలంలోని వివిధ సమస్యలను ఎమ్మెల్యే ప్రవీణ్ దృష్టికి తీసుకెళ్లగా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధికి శ్రీకారం చుడతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి శాలువ, పూలమాలలతో సత్కరించారు.

పంట ఉత్పత్తులు చోరి నిందితులను గుర్తించాలి

- ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి రాము

విశాలాంధ్ర-శావల్యాపురం : రైతులు ఆరుగాలం శ్రమించి కష్టపడి పండిస్తున్న పంట ఉత్పత్తులను చోరీ చేస్తున్న నిందితుల్ని పోలీసులు వెంటనే గుర్తించి బాధితులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు. మండలంలోని పోట్లూరు పంచాయతీ పరిధిలోని కృష్ణాపురానికి చెందిన గడిపూడి ప్రసాద్ పొలంలో గత గురువారం రాత్రి పొగాకు బేళ్ళు చోరీకి గురవ్వడంతో రైతు సంఘం నాయకులు శనివారం కృష్ణాపురానికి వెళ్ళి పంట పొలాన్ని పరిశీలించారు. రాము మాట్లాడుతూ రైతులు పొలాల్లో నిల్వ ఉంచిన పంట ఉత్పత్తులు, వ్యవసాయ పనిముట్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిస్తున్న ఘటనలు గత రెండేళ్ళుగా వినుకొండ ప్రాంతంలో పెరిగిపోయాయని, అసలే పంటలు సక్రమంగా పండక, పెట్టుబడులు పెరిగిపోయి రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే పంట ఉత్పత్తులకు కూడా రక్షణ లేకపోతే రైతులు వ్యవసాయం ఎలా చేయాలని ప్రశ్నించారు. రైతులు పొలాల్లో సీసీ కెమేరాలు పెట్టుకోవలసిన దారుణ పరిస్థితి నెలకొందన్నారు. పల్నాడు జిల్లాలో ఇటీవల పిడుగుపాటుకు గురై అనేకమంది రైతులు ప్రాణాలను కోల్పోయారని, ప్రభుత్వం వారికి రూ.5లక్షల చొప్పున ఎక్స్ గ్రేసియా ప్రకటించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం శావల్యాపురంలో ఎస్ఐ సురేష్‌ను కలసి పొగాకు బేళ్ళు చోరీ చేసిన నిందితులను వెంటనే గుర్తించాలని కోరారు. ఆయనతో పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, గడిపూడి ప్రసాద్. రైతులు ఉన్నారు.

రామోజీ మృతి పత్రికారంగానికి తీరని లోటు : కన్నా

విశాలాంధ్ర- సత్తెనపల్లి : తెలుగు పత్రికా, సాహితీ రంగంలో సంచలనానికి నాంది పలికిన ఈనాడు, సితార, చతుర, విపుల మరువలేనివని వీటి సృష్టి కర్త రామోజీ రావు అకాల మృతి సాహితీ రంగా నికి సమాజానికి రల తీరని లోటని సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శని వారం తన కార్యాలయంలో రామోజీ మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రైతు బంధు 'అన్నదాత' ఇవన్నీ రామోజీ మానస పుత్రికలన్నారు. మార్గదర్శి ఎందరికో తోడుగా నిలబడి, ఆర్థిక స్వావలంబన దిశగా సహాయ పడిందన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీ తెలుగు వారి సత్తా ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. ప్రియా పచ్చళ్ళు ప్రతి ఇంట్లో రుచులకు తోడయ్యాయని డాల్ఫిన్ హెటల్స్ హాస్పిటాలిటీ రంగంలో లాండ్ మార్క్ అన్నారు. ఈ టీవీ హుందాగా ఎలా వార్తా కథనాలు ఇవ్వాలో నేర్పించి మంచి తెలుగు భాష నిలబడి ఉండేలా కృషి చేస్తుంద న్నారు. మీ కలం ఆంధ్రా రాజకీయాలలో పెను మార్పులు తెచ్చిందన్నారు. తెలుగు రాష్ట్రాలకు మీరు అందించిన సేవలు అమూల్యం, చిరస్మరణీయం. మిమ్మల్ని కోల్పో వడం తెలుగు జాతికి దురదృష్టకరం. మీ ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నానన్నారు.

ఎన్నికల ఫలితాలుపై అధైర్యపడొద్దు : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

విశాలాంధ్ర-నరసరావుపేట : రాజకీయ పార్టీలకు గెలుపు ఓటములు సహజమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి వల్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడవద్దని, ఎల్లవేళలా మీకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధికా రంలోకి వస్తుందని, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని అందరం తలచామని, కానీ కొన్ని ప్రత్యేక పరిస్థితుల వల్ల పార్టీ ఓటమి చెందింద న్నారు. నూతనంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న కూటమి నాయకులు నరేంద్ర మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు డాక్టర్ గోపిరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. నరసరావుపేటలో గెలుపొందిన ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా నియోజక వర్గంలో, పట్టణంలో జరిగిన దాడులు, అల్లర్లపై ఇరు పార్టీల కార్యకర్తలు సమన్వయం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే తాను జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌ను కలిసి నియోజకవర్గంలో శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని తెలియజేశామని అన్నారు. తనను గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిం చిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, ఎలాంటి అవసరం వచ్చినా తనను సంప్రదించాలని డాక్టర్ గోపిరెడ్డి అన్నారు.

రామోజీరావుకు నివాళులర్పించిన జీవీ

విశాలాంధ్ర- వినుకొండ : వినుకొండ శాసనసభ్యులు జీ.వి.ఆంజనేయులు కార్యాలయంలో శనివారం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పఠాన్ అయబ్ ఖాన్ ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. నియోజకవర్గ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు రామోజీ ఫిలింమ్ సిటీ, ఈనాడు సంస్థల చైర్మన్, మార్గదర్శి, ప్రియా ఫ్రూట్స్, కళాంజలి సంస్థల అధినేత

రామోజీరావుకు ఘన నివాళులర్పించారు.

రామోజీరావు మృతితో దిగ్భ్రాంతి

- అపర మేధావి.. దర్శనికుడు రామోజీ
- తెలుగు భాష కీర్తి కుసుమం

విశాలాంధ్ర- వినుకొండ : ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు(88) మృతి చెందారు. హృద్రోగ సమస్యతో హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున 4:50 గంటలకు రామోజీరావు తుది శ్వాస విడిచారు. రామోజీ రావు మృతితో తెలుగు ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వినుకొండ పట్టణంలోని ఏన్. జి. ఓ. హోమ్‌లో రామోజీ రావు మృతికి పట్టణ ప్రము ఖులు, విలేఖరుల సంఘం ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. పట్టణ ఆరోగ్య శాఖ అధికారి కూచి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కొంజేటి నాగ శీను మాట్లాడుతూ పట్టుదలతో సామాన్య స్థాయి నుండి ఉన్నత శిఖరాలకు చేరారాని కొనియాడారు. ఈనాడు గ్రూపు సంస్థల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించారాని వక్తలు అభిప్రాయ పడ్డారు. బీజేపీ జిల్లా నాయకులు మేడం రమేష్ మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నతికి అక్షర పోరాటం చేసిన గొప్ప మేధావిగా నిలిచా రన్నారు. బీవీ నాగేశ్వరావు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఐకమత్యానికి కృషి చేసి, మార్గదర్శిగా నిలిచారన్నారు. తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న రామోజీ రావు మృతి తీరని లోటు అని కొనియాడారు. రామోజీ రావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుమ్మడి వెంకటేశ్వర రావు, భాగవతుల రవికుమార్, ఎస్.టి.యు నేత చంద్రజిత్తు యాదవ్, భారతదేశంలో ఎంవి నాయుడు, ఆల శ్రీనివాసరావు, చిరుమామిళ్ల కోటేశ్వర రావు, విద్యా వేత్తలు, విలేఖరులు, భాషాభిమానులు పాల్గొన్నారు.

రాయపాటికి ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే చదలవాడ

విశాలాంధ్ర-నరసరావుపేట : తన గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి జీవితాంతం రుణపడి ఉంటానని నరస రావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. మాజీ ఎంపీ, టీడీపీ సీనియర్ నాయ కులు రాయపాటి సాంబశివ రావును గుంటూరులోని ఆయన నివాసంలో డాక్టర్ అరవింద బాబు శనివారం మర్యాదపూర్వ కంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. దశాబ్ద కాలంగా టీడీపీకి దూరమైనా నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరవేయడానికి అండగా నిలిచిన రాయపాటి ప్రోత్సాహాన్ని ఎన్నటికీ మరచిపోలేనన్నారు. ఎన్నికల తర్వాత నియోజకవర్గంలో బీతావాహ వాతావరణం సృష్టించినా..టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడా సంయమనం కోల్పోకుండా పని చేశారన్నారు. సాంబశివరావు లాంటి సీనియర్ నాయకులు తోడుగా ఉండడం, వారి సలహాలు సూచనలతోనే ఎన్నికల్లో ఘన విజయాన్ని సొంతం చేసుకున్నామన్నారు. ఇదే విధమైన ప్రోత్సాహం భవిష్యత్తులో కూడా కొనసాగాలని అరవిందబాబు ఆకాంక్షించారు.

బాబుని ప్రజలు కోరుకున్నారు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : బాబు మరలా రావాలని ప్రజలు ప్రగాఢంగా కోరుకొన్నారని హైకోర్టు న్యాయవాది ఉల్లం శేషగిరిరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బాబు ఆవశ్యకతను రాష్ట్ర ప్రజలందరు గుర్తెరిగారన్నారు. అన్నారు. శనివారం పిన్నమనేని న్యాయభవన్ లో ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు ప్రముఖ న్యాయవాది, ఉషోదయ కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు పిన్నమనేని పాములయ్య అధ్యక్షత వహించారు. నా శిష్యుడు ఉల్లం, తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకట కోటయ్య తెలుగుదేశం పార్టీ విజయానికి స్థానిక ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారా యణకు అఖండ మెజారిటీ సాధించటానికి చేసిన కృషి ప్రశంసనీయమని పిన్నమనేని కొనియాడారు. పూజల మాట్లాడుతూ రాష్ట్రం శరవేగంతో అన్నిరంగాలలో అభివృద్ధి తథ్యమన్నారు. రానున్న కాలంలో కన్నా లక్ష్మీనారాయణ నాయకత్వంలో సత్తెనపల్లి నియోజకవర్గం అభివృద్ధిపథంలో నడుస్తుందన్నారు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేవలం రూ.10లతో మీ అభిమాన నేతకు శుభాకాంక్షలు తెలపొచ్చు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఇటీవల జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికల విజేతలను అభినందించేందుకు తపాలా శాఖ ఈ-పోస్ట్ ద్వారా శుభాకాంక్షలు తెలిపే ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెనాలి పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ జి.కరుణాకర బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రులకు ఈ-పోస్ట్ ద్వారా అభినందనలు తెలిపే వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. ఎన్నికల్లో విజయం సాధించిన ప్రతి ప్రజాప్రతినిధికి అభినందనలు..రాబోయే పదవీ కాలానికి శుభాకాంక్షలు తెలియజేయటానికి ఇది బాగా ఉపయోగపడుతుందన్నారు. కేవలం రూ.10 రుసుము చెల్లించి దగ్గరలో ఉన్న ఏదైనా ఒక పోస్ట్ ఆఫీస్‌లో ఈ-పోస్ట్ ద్వారా మీ ప్రియతమ నేతకు నేరుగా శుభాకాంక్షలు తెలియజేయవచ్చన్నారు. ఈ-పోస్ట్ సేవ గురించి మరింత సమాచారం కోసం మీ దగ్గరలోని పోస్ట్ ఆఫీసును సంప్రదించాలని కోరారు.

అక్షరం అనాథ అయ్యిందంటూ ఆవేదన

- రామోజీరావు చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించిన జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి

విశాలాంధ్ర-గుంటూరు : ఈనాడు గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్, వ్యాపార దిగ్గజం, కళాపిపాసి, పద్మ విభూషణుడు డాక్టర్ చెరుకూరి రామోజీరావు మరణ వార్త తెలిసినప్పటి నుంచి సొంత కుటుంబ సభ్యున్ని కోల్పోయినట్లుగా కోట్లాది హృదయాలు తల్లడిల్లుతున్నాయని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. శనివారం శ్రీనివాసరావుతోటలో రామోజీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ రామోజీరావు మరణంతో పాత్రికేయరంగం ఒక దిగ్గజాన్ని కోల్పోయిందని ఆవేదన చెందారు. సమాజంలోని పీడిత తాడిత ప్రజలకు, అన్యాయాలకు గురైన వారికి అక్షరం అనే ఆయుధానిచ్చి వారికి అండగా నిలిచిన అక్షర పోరాట యోధుడు రామోజీరావు అన్నారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వారిలో జనసేన పార్టీ డివిజన్ అధ్యక్షులు సయ్యద్ షర్ఫుద్దీన్, గద్దం రోశయ్య, నాజర్ వలి, మహేష్, టీడీపీ నాయకులు సయ్యద్ చాంద్, చింతకాయల వెంకట సాయి, గురుప్రసాద్, తిరుమలరావు, తేజ తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చబడినది

నేను **ఖజ్జాయం వెంకట నాగ శివ శ్రీరంగ సత్య సుమంత్** (పాతపేరు), తండ్రి : **ఖజ్జాయం వెంకట మనోహర రావు** ఇంటిడోర్ నెం.8-80, పప్పు బజార్, వినుకొండ టౌన్, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522647, ఇండియా. నా పేరును ఈ విధముగా మార్చుకొన్నాను. **ఖజ్జాయం వెంకట్ నాగ్ శివ్ శ్రీ సాయి సుమంత్** (కొత్తపేరు), తండ్రి : **ఖజ్జాయం వెంకట మనోహర రావు.** ఇప్పటి నుండి నేను ఈ పేరుతో పిలు వబడుచున్నాను. **ఖజ్జాయం వెంకట్ నాగ్ శివ్ శ్రీ సాయి సుమంత్** (కొత్తపేరు) తండ్రి : **ఖజ్జాయం వెంకట మనోహర రావు.**

175 స్థానాలకు గాను 164 స్థానాలు కూటమితో సాధ్యం

విశాలాంధ్ర-వినుకొండ : 2024 ఎన్నికల ఫలితాలలో తెలుగుదేశం పార్టీ 164 అసెంబ్లీ స్థానాలలో విజయ దుందుభి మోగించి భారతదేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో నూతన చరిత్రను రాసింది. అదేవిధంగా వినుకొండ నియోజకవర్గంలో జీవీ ఆంజనేయులు 31,700 అత్యధిక మెజారిటీ సాధించి వినుకొండ చరిత్రలోనే అత్యధిక మెజారిటీ సాధిం చిన శాసన సభ్యునిగా రికార్డు నెలకొల్పిన శుభ సందర్భంగా విను కొండ పట్టణ టైలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.కె బాండ్ టైలర్ ఆధ్వర్యంలో ఏనుగుపాలెం రోడ్డులోని మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్ లోని వారి కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి ఆనందోత్స వాల మధ్య సంబరాలు నిర్వహించారు. షేక్ బాండ్ మాట్లాడుతూ యావత్ భారత దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు చూసేలా 175 అసెంబ్లీ స్థానా లలో 164 స్థానాలు తెలుగుదేశం పార్టీ గెలవడం శుభ పరిణామం అన్నారు.కార్యక్రమంలో పట్టణటైలర్స్ అసోసియేషన్ కార్యదర్శి గోవింద రాజులు, రబ్బాని, తుమ్మ నారాయణ, సయ్యద్ జిలాని, అంజయ్య, వందనం, ఖాసిం, దర్జీ సోదరులు అత్యధికంగా పాల్గొన్నారు.

జగన్ కోవర్టులను కాంగ్రెస్ నుంచి బహిష్కరించాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వైఎస్ షర్మిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏపీ సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మావతి, రాకేష్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంటా గోపి అన్నారు. శనివారం పెదకూర పాడులో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో గోపి మాట్లాడుతూ జగన్ నిజ స్వరూపాన్ని తెలిసిన ప్రజలు నేడు ఓటు ద్వారా బుద్ధి చెప్పా రని గోపి అన్నారు. రాహుల్ గాంధీని పీఎంగా చూడాలను కోవడం ఆనాటి మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి కల అని, ఆ కలను నిజం చేసేందుకు షర్మిలమ్మ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా పార్టీలో చేరి పార్టీ గెలుపు కోసం అహర్నిశలు పని చేసిన వ్యక్తిని అనుచిత వ్యాఖ్య లతో బాధపెట్టడం సమంజసం కాదన్నారు. జగన్ రెడ్డి కోవర్టులను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని గోపి డిమాండ్ చేశారు. పార్టీ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తామని గ్రామ పార్టీ అధ్యక్షులు సుభాని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం. ఉదయ్ శేఖర్, గంటా తిరుపతయ్య, పి. వెంకట్రావు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి : కన్నా నాగరాజు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : రామో జీరావుకు సత్తెనపల్లి నియోజక వర్గ యువ నాయకులు కన్నా నాగరాజు ఘన నివాళి అర్పిం చారు. కన్నా నాగరాజు మాట్లా డుతూ తెలుగు మీడియా మొఘల్‌గా ఈనాడు పత్రిక అధిపతి చెరుకూరి రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరనిలోటని సీనియర్ జర్నలిస్ట్, అటు పత్రికా, ఇటు ఎలక్ట్రా నిక్ మీడియా రంగాలను వినూత్న రీతిలో తీర్చిదిద్దిన అక్షర యోధుడని నివాళి అర్పించారు. వివిధ హోదాలో ఉన్న తెలుగు దేశం, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

శ్రీ రామాలయంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దంపతులు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-అమరావతి : అమరావతి మండల పరిధిలోని అత్తలూరు గ్రామంలో కొలువు తీరి ఉన్న శ్రీ రామాలయంలో పెదకూరపాడు శాసన సభ్యులు భాష్యం ప్రవీణ్ దంపతులు శనివారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రోచ్ఛరణ నడుమ స్వామివారికి పూజలు చేయించి అనంతరం భాష్యం ప్రవీణ్ దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్ర మంలో వారి కుటుంబ సభ్యులతో పాటు పలువురు పాల్గొన్నారు.

లోకేష్ భారీ మెజారిటీతో గెలిచినందుకు కేక్ కటింగ్

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరిలో నారా లోకేష్ భారీ మెజారిటీతో విజయం సాధించడం పట్ల టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో శనివారం నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పేరం శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ మాజీ సభ్యులు డాక్టర్ కొండారెడ్డి నరహరి వర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ సభ్యులు బండి రమేష్, మానుపాటి గోవింద్, మానుపాటి రామకృష్ణ, సమతం పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ వినుకొండ
జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 304/2020
Between :
షేక్ కరిముల్లా ..... వాది
And
బాణావతు వెంకటేశ్వర నాయక్
మరియు ఇద్దరు .... ప్రతివాదులు
To :
3వ ప్రతివాది :
షేక్ రసూల్ బీ, భర్త మొహిద్దీన్
నవోదయ జూనియర్ కాలేజి దగ్గర, గురజాల టౌన్ మరియు మండలం, పల్నాడు జిల్లా, ఎ.పి.
పై నెంబరు దావాలో 3వ ప్రతివాది మరియు అందుగల I.A.No. 313/2020లో 3వ రెస్పాండెంట్ అయిన నీకు శ్రీ కోర్టువారు ఎన్ని పర్యాయములు సమను మరియు నోటీసు పంపినను నీవు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున పేపరు పబ్లికేషన్ ద్వారా శ్రీ కోర్టు వారు నోటీసు ఆర్డరు వేసినందున ది.21-06-2024 ఉదయం 10.00 గంటలకు పైన తెలిపిన శ్రీ కోర్టు నందు నీవు స్వయంగా గాని లేక ప్లీడరు గారి ద్వారా కాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియజేసుకొనవలయును లేనియడల నీ పరోక్షమున పై దావా తీర్మానము చేయబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా తేది:21-06-2024
గంధం వెంకటేశ్వర్లు, బి.ఎ. బి.యల్.
న్యాయవాది & నోటరి, వినుకొండ,
పల్నాడు జిల్లా,
సెల్ : 7382041343
వినుకొండ, తేది: 08-06-2024